ప్రజాశక్తి

గురువారం 11 జనవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఎంత బెదిరించినా తగ్గం

- అంగన్వాడీల పునరుద్ఘాటన - 30వ రోజుకు సమ్మె
- న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని బార్ అసోసియేషన్ భరోసా



గుంటూరు శిబిరంలో 30వ రోజు ఆకారంలో కూర్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో సమ్మె ప్రారంభించిన నెల రోజులు అయిన సందర్భంగా అంగన్‌వాడీలు 30 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు కోటేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. మూడవ రోజు రిలే నిరాహార దీక్షల్లో టి.రాధా, కె.శివకుమారి, ఎ.పద్మావతి, బసవపున్నమ్మ, సిహెచ్.జ్యోతి, ఎ.భార్గవి, జె.నాగలక్ష్మి కూర్చున్నారు. నేతాజి మాట్లాడుతూ చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై సమస్యలు పరిష్కరించకుండా, మొదటి నుండి తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. అప్రజాస్వామిక చర్యలను ప్రజలు అంగీకరించరని స్పష్టం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ తదితరాల ధరలు భారీగా పెరిగినందున వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరం కొనసాగింది. రిలేదీక్షలను శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి ప్రారంభించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన ప్రభుత్వం తాజాగా సూపర్‌వైజర్ల ద్వారా షోకాజ్ నోటీసులను కార్యకర్తల ఇళ్లకు అంటిస్తున్నారని, ఎన్ని బెదిరింపులకు భయపడబోమని,

▶ 2లో



పల్నాడు జిల్లా నరసరావుపేట శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు



ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఇజ్రాయిల్ రాయబారి

పల్నాడులో ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు

- బాలాజీ నగర్ వద్ద సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు శంకుస్థాపన
- తక్కువ నీటితో పంటల సాగు కోసం ఏర్పాటు

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని బాలాజీ నగర్ తండా వద్ద 25.57 ఎకరాలో రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన ఇండో-ఇజ్రాయిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను (సమర్థత కేంద్రం) మంత్రులు, ఎంపీ, ఇజ్రాయిల్ ప్రతినిధులు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ఇజ్రాయిల్ రాయబారి నూరి గొలిన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, మిర్చిలోని సుమారు 25 రకాల వంగడాల ప్రదర్శనను వారు పరిశీలించారు. అనంతరం మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉత్పత్తయ్యే పంటల్లో ఏపీ వాటా 15 శాతమన్నారు. రాష్ట్రంలో 40265 ఎకరాల్లో ఉద్యాన పంటలు, 139 ఎకరాల్లో అపరాలు సాగవుతున్నాయని, ఆధునిక శాస్త్ర సాంకేతిక విధానాల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించడం కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పని చేస్తుందని చెప్పారు. ఇజ్రాయిల్ దేశంలో చాలా చిన్నదైనా, నీటి కొరత ఎక్కువే అయినా ఆధునిక సాంకేతికత ద్వారా అధిక దిగుబడులు పొందుతున్నారని చెప్పారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నకరికల్లు మండలంలో సమర్థత కేంద్రం ఏర్పాటు ఈ ప్రాంత ప్రజలకు ఒక

▶ 2లో



గుంటూరులో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

4, 5 లో

16వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

3 లో

బెదిరింపులు మాని.. సమస్యలు పరిష్కరించాలి

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

8 లో

లోక్‌సభకు కొత్త ముఖాలు

- ఆర్థిక భారంతో ముందుకు రాని సీనియర్లు
- బరి నుంచి తప్పుకున్న జయదేవ్, సాంబశివరావు
- సందిగ్ధంలో శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థిత్వం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాలకు టిడిపి, వైసిపి తరుపున పోటీ చేసేందుకు అభ్యర్థుల కొరత వెంటాడుతోంది. ఆర్థిక భారం పెరగడంతో సీనియర్లు ముందుకు రావడం లేదు. ఎంపీగా గెలిచినా ఎమ్మెల్యేలకు ఉన్న ఆధిపత్యం ఎంపీలకు ఉండటంలేదనే వాదన కూడా లేకపోలేదు. ఎమ్మెల్యేలను కాదని ఎంపిలు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించే పరిస్థితి కూడా లేకుండాపోయింది. దీంతో చాలామంది సీనియర్లు ఎంపిగా పోటీకి ఆసక్తి చూపడం లేదు.

తాజాగా గుంటూరు లోక్‌సభకు పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎంపి గల్లా జయదేవ్ ఈసారి ముందుకు రావడం లేదు. ఆయన జిల్లా రాజకీయాల నుంచి దాదాపుగా ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది. ఆయన స్థానంలో టిడిపి అధిష్టానం బలమైన అభ్యర్థి కోసం అన్వేషిస్తోంది. తెనాలి ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గుంటూరు లోక్‌సభకు పోటీ చేయాలని పార్టీ అధిష్టానం సూచించగా ఆర్థిక భారం నెపంతో ఆయన సుముఖత చూపలేదని తెలిసింది. తనకు తెనాలి అసెంబ్లీ స్థానంలోనే అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీకి చెందిన సీనియర్‌లకు ఎవర్ని సంప్రదించినా ఎంపిగా పోటీ చేసేందుకు ముందుకు రాకపోవడంతో రాజకీయాలతో సంబంధం లేని కార్పొరేట్ రంగాలకు చెందిన వారిని తీసుకురావడం పరిపాటైంది. ఈ నేపథ్యంలో గుంటూరు లేదా నర్సరావుపేటకు ప్రముఖ విద్యాసంస్థల అధినేత భాష్యం

▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

విద్యుత్ సర్వీసుల తనిఖీ

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండల పరిధిలో 41 బృందాలుగా సిబ్బంది బుధవారం విద్యుత్ తనిఖీలు చేపట్టారు. 3342 సర్వీసులను తనిఖీలు చేపట్టగా 105 అదనపులోడు వాడుతున్నట్లు గుర్తించి రూ.6.40 లక్షలు జరిమానా విధించారు.

స్కూల్ యజమాన్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకాష్ నగర్ రిక్షా సెంటర్లోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడి పందెం నిర్వహించడాన్ని ఒక విలేకరి ప్రశ్నించారు. దీన్ని సహించలేని స్కూల్ డైరెక్టర్ సదరు విలేకరికి ఫోన్ చేసి దుర్భాషలాడ్డంతోపాటు చంపుతానని బెదిరించారని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులు ఫిర్యాదు చేశారు. ఎపిడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విలేకరుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రొంపిచర్ల : ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టిన గ్రామ వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన పెన్షను పంపిణీ, ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వాలంటీర్లను సంచులు మోసేవారని, ఇళ్ళలో ఆడవాళ్ళు ఉన్నారని ఎద్దేవా చేశారని, అయితే కరోనా కష్టకాలంలో వాలంటీర్లు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకునేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. అనంతరం నాబార్డు నిధులతో పాఠశాలలో నిర్మించిన తరగతి గదులను, లైబ్రరీ రూములన ప్రారంభించారు. తహసీల్దార్ జి.అంకారావు, ఎంపిడిఒ కె.మ్యాథ్యూబాబు, ఎంపిపి జి.వెంకట్రావు, హెచ్‌ఎం బియం సుభాని, ఇన్‌ఛార్జి సర్పంచ్ పి.చక్రారెడ్డి, మాజీ సర్పంచ్ జి.చినకోటిరెడ్డి, విఆర్ఒ పి.సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు పి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

ప్రకృథి వ్యవసాయంపై సమావేశం

ప్రజాశక్తి - అమరావతి : పకృతి వ్యవసాయం కార్యాచరణ ప్రణాళిక-2024పై మండలంలోని అత్తలూరులో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి వివిధ అంశాలపై మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులను ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అత్తలూరు ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూస్ కంపెనీ సీఈఓ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన పెట్టుబడులు తగ్గుతాయని, చీడపీడలు ఉధతి తక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రతి మహిళా తప్పనిసరిగా కిచెన్ గార్డెన్స్ వేసుకునేలా చూడాలన్నారు. అమరావతి, పెదకూరపాడు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాలలో 5170 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ప్రేమ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా మాట్లాడండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి కి రోగుల తాకిడి ఎక్కువగా పెరిగిందని వారి పట్ల మర్యాదగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఉద్బోదించారు. బుధవారం నూతనంగా 30 మంది స్టాఫ్ నర్సు లుగా నియామకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో వేలాది పోస్టులను భర్తీ చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రికి 30 స్టాఫ్ నర్సింగ్ పోస్టులను మంజూరు చేసిందని అయన చెప్పారు. ప్రభుత్వం కొత్త పోస్టులను మంజూరు చేసి ఉపాధి అవకాశలను కల్పిస్తోందని ఆయన చెప్పారు. వైద్య రంగం లో ఈ ప్రభుత్వం అనేక మార్పులను తీసుకుని వస్తుందని ఆయన తెలిపారు. స్టాఫ్ నర్సులు గా పోస్టులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి కి కతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినప్పుడు విధుల్లో నిబద్దత తో పని చేయాలనీ అయన సూచించారు. ముఖ్యంగా రోగుల పట్ల మర్యాద తో ఉండాలని ఒకటికి రెండుసార్లు రోగుల నుంచి వత్తిళ్ళ వచ్చినప్పుడు సంయమనం పాటిస్తూ విసుగు లేకుండా సమాధానం చెప్పినప్పుడు రోగులు ఎంతో ప్రేమను చూపిస్తారని ఆయన చెప్పారు. గతం లో నర్సింగ్ సిబ్బంది రోగులతో మమేకమై సేవలు అందించే వారని అయన గుర్తు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బంది ఆసుపత్రి సమీపం లో నివాసం ఉండే విధంగా వెసలుబాటు కల్పించుకోవాలని అయన చెప్పారు. ఇటీవల నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు నూతన ఉత్సహం తో పని చేసి మంచి పేరు తీసుకుని రావాలని అయన సూచించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆసుపత్రి లో స్టాఫ్ నర్సుల పోస్టులను కేటాయించడం పై ధన్యవాదాలు సిఎం గారు అంటూ నర్సింగ్ సిబ్బంది నినాదాలు చేసారు. ఈ కార్యక్రమం లో నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.



లోక్‌సభకు కొత్త ముఖాలు

(మొదటి పేజీ తరువాయి)

రామకృష్ణ పేరును టిడిపి అధిష్టానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఆయన అంగీకరించకపోతే భాష్యం ప్రవీణ్ పేరును పరిశీలించే అవకాశం ఉంది. నర్సరావుపేట లోక్‌సభకు కూడా టిడిపి అభ్యర్థిగా ఖరారు కాలేదు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గుంటూరు నుంచి పోటీకి అంగీకరిస్తే భాష్యం కుటుంబంలో ఒకరిని నర్సరావుపేటకు పంపుతారని ప్రచారం మవుతోంది.

వైసిపికి సంబంధించి గుంటూరు ఎంపి అభ్యర్థిగా ఎవ్వరూ ఖరారు కాలేదు. క్రికెటర్ అంబటి రాయుడు పార్టీలో చేరిన కొద్దిరోజులకే ఆయన పార్టీ నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటి అయ్యారు. గుంటూరు నుంచి జనసేన పొత్తు ఉంటే ఎంపిగా పోటీ చేయగలనని ఆయన పవన్ కల్యాణ్‌కు చెప్పినట్టు తెలిసింది. నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులును గుంటూరు నుంచి పోటీ చేయించాలని సిఎం జగన్ తలపెట్టారు. ఇందుకు కృష్ణదేవరాయులు అంగీకరించలేదు. తాను మరోసారి నర్సరావుపేట నుంచి పోటీ చేస్తానని లేదంటే పార్టీ నుంచి తప్పుకుంటానని అధిష్టానానికి స్పష్టం చేశారు. దీంతో ఆయనకు టిడిపి గాలం వేసేందుకు విఫలయత్నం చేసింది. నర్సరావుపేట నుంచి వైసిపి అవకాశం ఇవ్వకపోతే తాము అవకాశం ఇస్తామని టిడిపి నాయకులు ముందుకు వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయనతో కొంతమంది టిడిపి సీనియర్ నాయకులు రహస్యంగా చర్చలు జరిపారు.

మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు 2014, 2019లో నర్సరావుపేట నుంచి పోటీ చేశారు. 2014లో గెలిచారు. 2019లో ఓడిపోయారు. ఆ తరువాత ఆయన వయోభారంతో రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించలేకపోయారు. శ్రీకృష్ణదేవరాయలకు నర్సరావుపేటలో అవకాశం కల్పిస్తే గుంటూరులో బిసి లేదా ఆర్యవైశ్యులకు అవకాశం ఇవ్వాలని వైసిపి అధిష్టానం యోచిస్తోంది. బాపట్ల నుంచి పోటీ చేసేందుకు ఈసారి వైసిపి, టిడిపి కొత్త అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపి నందిగం సురేష్‌కు మరో స్థానం కేటాస్తారని ప్రచారమవుతోంది. రిటైర్డు ఐఎఎస్ అధికారి విజయకుమార్ పేరు వైసిపి అభ్యర్థిగా ప్రచారంలో ఉంది. టిడిపి కూడా అసెంబ్లీలో అవకాశం దక్కని వారికి బాపట్ల ఎంపిగా పోటీ చేయించాలని భావిస్తోంది. మాజీ ఎంపి శ్రీరాం మాల్యాద్రి పేరుకూడా పరిశీలనలో ఉంది.



కన్నా అభ్యర్థిత్వం ఖరారు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుండి టిడిపి అభ్యర్థిగా ఆ పార్టీ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ పోటీ చేస్తారని అధిష్టానం స్పష్టం చేసింది. టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి నుండి పోటీ చేస్తారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు ప్రకటించడంతో సత్తెనపల్లికి వచ్చిన ఆయన్ను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించారు. అయితే కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి నుండి పోటీ చేయటం ఇష్టం లేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి పోటీకి ఆసక్తి చూపుతున్నారని కొన్ని రోజులుగా ప్రచారమవుతోంది. మరోవైపు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు కూడా సత్తెనపల్లి సీటును ఆశిస్తున్నారు. టిడిపి జనసేన పొత్తులో భాగంగా సత్తెనపల్లి అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించాలని అప్పారావు పట్టుబడుతున్నారు. పొత్తు ధర్మాన్ని విస్మరించి టిడిపి అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారంటూ ఆయన ఈ విషయాన్ని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారని ప్రచారమవుతోంది. ఇదిలా ఉండగా టిడిపి నుండి ఇదే సీటును ఆశిస్తున్న కోడెల శివరాం కూడా అసంతృప్తిగా ఉన్నారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని చెబుతున్నారు.



ఎంత బెదిరించినా తగ్గం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ పోరాడతామని చెప్పారు. జాబ్ చార్ట్‌లో లేని అనేక సేవలను అందిస్తున్న అంగన్వాడీలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారికి కనీస వేతనం, ఉద్యో భద్రత ఎందుకివ్వరని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా సమ్మెకు నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మెదరమెట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని, ధైర్యంగా పోరాడాలని చెప్పారు. అంగన్వాడీల కోసం న్యాయ పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. కె.రాధిక, డి.ఉదయశ్రీ, ఎం.హరీష్‌కుమార్, బి.సలీం, కె.ఎస్.ఆర్.ఎ ఆంజనేయులు పాల్గొన్నారు.



ఇళ్లకు షోకాజులు అంటిస్తున్నారు..

యు.పద్మ, జి.మాధవి, కరీమూన్

అంగన్వాడీ కార్యకర్తలు, నరసరావుపేట ప్రాజెక్టు.

ఎస్మాను ప్రయోగించినా వెనకడుగేయం.. ఉద్యోగ భద్రత కల్పనతోపాటు వేతనాలపై హామీలను అమలు చేసే వరకూ పోరాడతాం. మేం సమ్మె చేస్తుంటే సూపర్‌వైజర్, ఇతర అధికారుల ద్వారా షోకాజు నోటీసులను ఇళ్లకు అంటించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సేవలు చేస్తున్న మేము ప్రతిఫలం అడుగుతుంటే బెదిరిస్తున్నారు. ఇదే విధంగా ప్రభుత్వం వ్యవహార శైలి ఉంటే సమ్మెను ఉధృతం చేయడంతోపాటు వచ్చే ఎన్నికల్లో మా కుటుంబాలన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తాయి.

సిఎం మోసం చేశారని తెలుగు యువత ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నైజమని కమీషన్లకు కక్కుర్తి పడి రాష్ట్రం నుంచి కంపెనీలను తరిమేశారని ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా యువత భవితతో చెలగాటమాడుతున్నారని నరసరావుపేటలో తెలుగు యువత ఆధ్వర్యంలో 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై యువకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి యువతను మోసం చేసి అధికారంలోకి వచ్చారని,అధికారంలోకి వచ్చి 5 ఏళు ౹ గడుస్తున్నా ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదన్నారు. కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసి పైశాచిక ఆనందం పొందుతున్నాడని విమర్శించారు.నియోజకవర్గ టిడిపి బాద్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు, షేక్ నాగూర్ పాల్గొన్నారు.

పల్నాడులో ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

వరమన్నారు. రాష్ట్రంలో ఇది రెండవ కేంద్రమని చెప్పారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయ మాట్లాడుతూ గతంలో రైతులు వర్షాల్లేక నీళ్ల కోసం రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, అటువంటి శ్రమ లేకుండా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేలా ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు పల్నాడు ప్రజలకు గొప్ప వరమని అన్నారు. ఇజ్రాయిల్ రాయబారి నూరి గిలోన్ మాట్లాడుతూ భారత్ ఇజ్రాయిల్ సంబంధాలు కొనసాగాలని, రానున్న రోజుల్లో మరో 14 కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీధర్‌బాబు, పల్నాడుజిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఉద్యాన శాఖ పల్నాడు జిల్లా అధికారి బేన్నీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సాయిమార్కొండరెడ్డి పాల్గొన్నారు.



మిర్చి వంగడాలను పరిశీలిస్తున్న ఇజ్రాయిల్ రాయబారి

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల కమిషన్ వారు నిర్దేశించిన మేరకు డిసెంబర్ 9 వ తేది వరకు వచ్చిన క్లైమ్స్ ఆబ్జెక్షన్లను జనవరి 12 వ తేది లోపు పరిష్కరించి ఓటర్ల జాబితా రూపొందించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో ఇప్పటి వరకు 1050 పెండింగ్ క్లయిం దరఖాస్తులు పరిష్కరించవలసి వుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జనవరి 12 వ తేది లోపు వాటిని సహేతుకంగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత ఈఆర్ఓ లకు సూచించడం జరిగిందన్నారు. మరో రెండు రోజులలో గడువు ముగుస్తున్నందున పెండింగ్ అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని , ఎట్టి పరిస్థితులలోనూ గడువు లోపు చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓ లకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. గత 25 వారాల నుండి క్రమం తప్పక ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారు సూచించిన అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించటం జరుగుతున్నదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి, గుంటూరు నగర కమీషనర్



కీర్తి చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు తో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నుండి డా. సేవా కుమార్, భారతీయ జనతా పార్టీ తరుపున, రాచుమల్లు భాస్కర రావు (జిల్లా జనరల్ సెక్రెటరీ) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున బిళ్ళా సునీల్ (జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆఫీస్ ఇన్చార్జి) , తెలుగుదేశం పార్టీ నుంచి కంచర్ల శివరామయ్య (కార్యాలయ సెక్రటరీ), బహుజన్ సమాజ్ పార్టీ తరపున చిరతనగండ్ల వాసు పాల్గొన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవీంద్రరావు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీఖర్, నగరపాలక సంస్థ అదనపు కమి షనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీషా పాల్గొన్నారు.

సమతా సంకల్పం ర్యాలీలు చేపట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

విజయవాడలో 125 అడుగుల డా. బి. ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు సచివాలయ , మండల , జిల్లా స్థాయిలలో సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం మున్సిపల్ కమిషనర్లు , మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని జనవరి 19 వ తేదీన ప్రారంభిస్తున్నందున సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయంలో అంబేడ్కర్ విగ్రహం ఫోటోలు డౌన్లోడ్ చేసుకొని స్థానిక పెద్దలతో కలసి పూలమాలలు వేయడం , అంబేడ్కర్ విగ్రహ ఫ్లెక్సీ పై సంతకాలు సేకరించడం , సోషల్ జస్టిస్ పై సచివాలయ పరిధిలో చర్చ అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా స్థాయిలోనూ మారథాన్ , మానవహారాలు , ఫోటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్



వాడీ కేంద్రాలను సమ్మె విరమించి విధుల్లో చేరిన అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ పంచనామ చేసి అప్పగించాలన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను సందర్శించి క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. సంక్షేమ పద్ధకలకు సంబంధించి జనవరి 23 వైయస్సార్ ఆసరా, ఫిబ్రవరి 5 న వైయస్సార్ చేయూత నిధులు జమ చేయనున్నందున నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రీ లాంచింగ్ , లాంచింగ్ డే , పోస్ట్ లాంచింగ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష -2, హౌసింగ్ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించి సూచనలు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి, జెడ్పీ సిఈఓ మోహన్ రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ , సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు , హౌసింగ్ పీడీ వేణుగోపాల్ , బీసీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి , ఎస్సీ కార్పొరేషన్ ఈడి ప్రేమ కుమారి , ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విజయవాడలోఈనెల 19న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారు మూడి విక్టర్ ప్రసాద్ కోరారు. బుధ వారం స్థానిక రహదారులు మరియు భవనాల శాఖ అతిథి గహంలో విక్టర్ ప్రసాద్ పత్రికా విలేకరుల సమా వేశంలో విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ బారతదేశంలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, పీఠం 80 అడుగులు మొత్తం 205 అడుగుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకొందన్నారు. స్వరాజ్ మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ స్మృతి వనంలో అంబేద్కర్ విగ్రహంతో పాటు మూడు వేల మంది కూర్చోగలిగే మల్టీ



కన్వెన్షన్ హాల్, 2 వేల మంది ఆసీనులు కాగల ఓపెన్ థియేటర్, బుద్దిస్ట్ మెడిటేషన్ హాల్, పదివేల పుస్తకాలతో లైబ్రరీ, ఫౌంటెన్లు, పార్కు వంటి అన్ని రకాల సదుపాయాలతో దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత సుందరంగా అద్భుతంగా నిర్మించడం జరిగిందన్నారు. అంబే ద్కర్ స్మృతి వనంతో విజయవాడ ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుతుంద న్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అందరి వాడు అనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు లక్షలాదిగా ప్రజలందరూ స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ఎస్సీ కమి షన్ తరుపున విగ్రహావి ష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అమరావతిలో ఒక మూలన అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాలు కాలం గడిచినా అమలు చేయలేద న్నారు. వైసిపి ప్రభుత్వం విజయ వాడ నడిబొడ్డున చారిత్రాత్మ కమైన స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేశారని అన్నారు.

బకింగ్ హాం కాల్వలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి - తెనాలి

ఈత కోసం కాలువలో దిగి బాలుడు గల్లంతైన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం గుంటూరులోని ఏటుకూరు రోడ్డు దర్గా మాన్యంకు చెందిన కౌలూరి నాని(18) బుధవారం సంగంజాగర్లమూడి శివాలయం ఎదురుగా బకింగ్ హామ్ కాలువలో ఈతకోసం దిగాడు. నానితోపాటు అతని తమ్ముడు, ఇద్దరు మిత్రులు మొత్తం నలుగురు కలిసి ఈతకు వచ్చి కాలువలో దిగారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో నాని నీళ్లలో మునిగి కొట్టుకుపోయాడు. నాని సోదరుడు, మిత్రులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారంతా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కూడా అక్కడికి చేరుకొని బాలుడి కోసం గాలింపు మొదలు పెట్టారు.

ఎన్‌డిఆర్ఎస్ బృందాల గాలింపు

బకింగ్ హామ్ కెనాల్ లో ప్రమాదవశత్తు గల్లంతైన బాలుడు కౌలూరి నానిని(18) వెతికేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం సిద్ధమైంది. స్థానికులు కాలువ వెంట గాలించినా ఫలితం లేకపోవడంతో తాసిల్దార్ కె రవిబాబు జిల్లా కలెక్టర్‌నకు సమాచారం ఇచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎన్డీఆర్ఎఫ్ బందాన్ని పంపాల్సిందిగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ను లిఖిత పూర్వకంగా కోరారు. దీనిపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందించి, ఎన్టీఆర్ ఆఫ్ బందాన్ని కేటాయించినట్లు తహసిల్దార్ తెలిపారు. ఆ బృందం గురువారం ఉదయానికి రంగంలోకి దిగనుంది.



అప్రమత్తమైన పోలీసులు

ప్రజాశక్తి-తాడేపల్లి

మెగా డిఎస్‌సి విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాలు సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో తాడేపల్లి బైపాస్‌రోడ్డు మొత్తం పోలీసు వలయంలోకి వెళ్లింది. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి పంపించారు. దీంతో కనకదుర్గ వారధిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. సిఎం క్యాంపు కార్యాలయానికి వచ్చే రోడ్లన్నీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని తనిఖీ చేసిన అనంతరం పంపించారు.



రామ్ రాజ్ షోరూం ప్రారంభిస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం

రామ్‌రాజ్ వస్త్ర షో రూం ప్రారంభం

ప్రజాశక్తి తెనాలి : సంక్రాంతి పండుగను పరస్కరించుకొని స్థానిక బోస్ రోడ్డు లోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో పేరొందిన తెనాలి వస్త్ర వ్యాపారులకు మంచి అవకాశాలను కల్పిస్తుందన్నారు. షాపు నిర్వాహకులు కన్నన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా కాటన్, లెనెన్, మగవారికి పంచెలు, షర్ట్స్, బనియన్లు షోరూంలో లభిస్తాయని చెప్పారు. తెనాలిలో ప్రారంభించిన షోరూమ్ తో రామ్ రాజ్ కాటన్ షోరూంలో సంఖ్య 289కి చేరిందన్నారు. కార్యక్రమంలో రావూరి సుబ్బారావు, దేసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎత్తిపోతలకు పెరిగిన జల ప్రవాహం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు జల ప్రవాహం పెరిగింది. రెండ్రోజులుగా సాగర్ కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తుండటంతో ఎత్తిపోతల జల కళను సంతరించుకుని పర్యాటకులను ఆకర్షిస్తోంది. గతేడాది వర్షాలు అరకొరగానే కురవడంతో ఎత్తిపోతల ఎండిపోయినట్లు కళావిహీనంగా మారింది. మరలా ఎత్తిపోతల జలకళను సంతరించుకోవడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి అముల్యా డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ సత్తెనపల్లి పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నాయని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇశాంత్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు లింగంగుంట్ల-1 మహిళల వాలీబాల్ జట్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లింగంగుంట్ల శంకరభారతిపురం హైస్కూల్‌లో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో లింగంగుంట్ల -1 వాలీబాల్ మహిళా జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. మండల స్థాయిలో 70 మ్యాచ్‌లలో 140 జట్లు పాల్గొన్నట్లు ఎంపిడిఒ వుసర్తి శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించడంతోపాటు కబడ్డీ, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వాలీబాల్ మహిళ జట్టు 22 జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, నాయకులు పి.రవీంద్రబాబు, షేక్ ఖాజావలి, ఇన్చార్జి ఈవోపీఆర్డి కెవి శివప్రసాద్, పిఇటిలు ఝాన్సీరాణి, రమాదేవి, ఫాతిమా, బాజి, వెంకటరామిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



పరిష్కారాన్ని మానేసి కక్షసాధింపు సరికాదు

30వ రోజుకు అంగన్వాడీల సమ్మె - బహుముఖ రూపాల్లో నిరసనలు



సత్తెనపల్లి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ అంగన్వాడీలు 30 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా కక్షసాధింపు చర్యలకు పూనుకుందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య విమర్శించారు. అంగన్వాడీలపై ఎస్మా చట్ట ప్రయోగం దారుణమని అన్నారు. సత్తెనపల్లిలోని సమ్మె శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలేగాని కక్ష పూరిత ధోరణిని ప్రదర్శించకూడదన్నారు. ప్రజా సమస్యలను విస్మరించిన గత ప్రభుత్వాలకు ఏ గతి పట్టిందో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజాత, అహల్య, చాముండేశ్వరి, ధనలక్ష్మి, దుర్గాభవాని, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె పట్టణంలో 30వ రోజు కొనసాగింది. చిన్నారులతో కలిసి అంగన్వాడీలు సమ్మె శిబిరంలో రిలేదీక్షలు చేశారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హజ్ర, డి.శాంతమణి మాట్లాడారు. అంగన్వాడీలకు ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లు నోటీసులు ఇవ్వడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలతోపాటు గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, అంగన్వాడీలు సుజాత, జయశ్రీ, శివకుమారి, కవిత, బాజీబీ, స్వప్న, శివపార్వతి, గురవమ్మ సబియా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. యూనియన్ నాయకులు ఉషారాణి మాట్లాడారు. ఇందిర, కె.పద్మావతి, శాంతలత, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా, శివలక్ష్మి, రుక్మిణి, జయలక్ష్మి, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సురేష్ మహల్ రోడ్‌లోని సమ్మె శిబిరాన్ని ఎపిటిఎఫ్ ఉపాధ్యాయులు సందర్శించి సంఘీభావం తెలిపారు. షోకాజ్ నోటీసులకు భయపడొద్దని, బెదిరింపులకు లొంగొద్దని చెప్పారు. గంగినేని ఫౌండేషన్ చైర్మన్ గంగినేని రాఘవ ఎపిటిఎఫ్ ఉపాధ్యాయులు వి.చంద్రమౌళి, ఎస్.మూర్తి, బి.వి నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, ఎస్కే షరీఫ్, గురుబాబు, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, శివరామకృష్ణ, ఆంజనేయులు, అంగన్వాడీ నాయకులు ఎఎల్ ప్రసన్న, డి.బీబులు, నిర్మల, సిహెచ్ గాయత్రి. పి.ఉమాశంకరి. ఎన్.కృష్ణకుమారి, జె.సూర్య, శ్రీదేవి, హరిత పాల్గొన్నారు.



మాచర్ల



పిడుగురాళ్ల



అమరావతి



చిలకలూరిపేట



వినుకొండ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక గ్రంథాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా రిలేదీక్షలను యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి.సావిత్రి ప్రారంభించారు. ఎ.పద్మ, ఎం.విల్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

సమస్యలను పరిష్కరించడం మానేసి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని విమర్శించారు. అంగన్వాడీ సమ్మెలో భాగంగా అమరావతిలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని లక్ష్మీనారాయణ అన్నారు. సమ్మెకు మద్దతుగా న్యాయవాది నీలగిరి కోటయ్య మాట్లాడుతూ గౌరవ వేతనాలు ఇచ్చేవారిగా అంగన్వాడీలను గుర్తించిన ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించే హక్కు లేదని అన్నారు. అనంతరం అంగన్వాడీలు సమ్మె శిబిరం నుండి ప్రదర్శనగా గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు చేరుకున్నారు. కొవ్వొత్తులు వెలిగించి 30 సంఖ్య ఆకారంలో పెట్టారు. కొవ్వొత్తులతోనే మానవహారంగా ఏర్పడ్డారు. సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు అంగన్వాడీలు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

16వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



నరసరావుపేట



మాచర్ల

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన పల్నాడులో మున్సిపల్ కార్మికుల సమ్మె 16వ రోజైన బుధవారమూ కొనసాగింది. పోటీ కార్మికులను రంగంలోకి దించగా వారిని సమ్మె కార్మికులు అడ్డుకోవడంతో కొద్దిపాటి వాగ్వాదం తలెత్తింది. పోటీ కార్మికులు వెళ్లిపోవడంతో సమ్మె కార్మికులు శిబిరానికి చేరకుని నిరసన కొనసాగించారు. సాయంత్రం వేళ పట్టణంలో భిక్షాటనతో నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.సాల్మన్, గౌరవ అధ్యక్షులు శిలార్ మాసూద్, నరసరావుపేట అధ్యక్షులు టి.మల్లయ్య, కార్యదర్శి డి.యోహాను, కార్మికులు శేఖర్, నవీన్, శ్రీను, జయరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యలను పరిష్కరించాలని 16 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు బుధవారం స్థానిక హైలాండ్ సెంటర్ నుండి బ్యాంకు సెంటర్, గంగమ్మగుడి, జానపాడు రోడ్డు వరకు వరకు అర్ధనగ్నంగా ఆకులు పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ బట్టల్లేకుండా ఆకులు కట్టుకునే స్థాయికి కార్మికులను ప్రభుత్వం దిగజార్చిందని విమర్శించారు. సమ్మెకు అంగన్వాడి వర్కర్లు మద్దతు తెలిపి ప్రదర్శనలో పాల్గొన్నారు. కె.సీతారామయ్య, కొండలు, ఎ.రామారావు, యు.రామారావు, డి.శ్రీనివాసరావు, రామారావు, వెంకటేశ్వర్లు, సురేంద్ర, సాగర్ బాబు, బ్రహ్మయ్య, గంగాధర, అనంతలక్ష్మి, డి.లక్ష్మి, వి.మేరీ, లక్ష్మి, పున్నమ్మ, గంగమ్మ, అనిల్, శ్యాంకోటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని సమ్మె శిబిరం కొనసాగింది. సిఐటియు నాయకులు బి.మహేష్, జెఎసి కన్వీనర్ పి.అబ్రహాంలింకన్, కె.రమణ, అనసూయ, బి.చిన్నమ్మాయి, లక్ష్మీదేవి, డి.రమణ, ఇస్సాకు, ఆంజమ్మ, మల్లమ్మ, సుబ్బారావు, డి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరి, గురవమ్మ, లక్ష్మమ్మ, కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మ, ఎం.కన్నయ్య, సంతోషమ్మ పాల్గొన్నారు.



పిడుగురాళ్ల



వినుకొండ

ప్రజాశక్తి - వినుకొండ

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధులు లాయర్ స్ట్రీట్, కొత్తపేట, పల్నాడు రోడ్, బస్టాండ్ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా బిక్షాటన చేశారు. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడారు. యు.రాము, పి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, అబ్రహం రాజు, ఏసుపాదం, ఏసు, జాను, ఇశ్రాయేలు, మంగయ్య, నాగరాణి, సారమ్మ,రామకోటి, రాములు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలంటే ... షోకాజ్ నోటీసులా...

ప్రజాశక్తి - మంగళగిరి :అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజు చేరింది. అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని సిఐటి రాజధాని కమిటీ కార్యదర్శి ఎం భాగ్యరాజు మద్దతు తెలియజేసి ప్రసంగించారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడానికి వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, అంగన్వాడి యూనియన్ల నాయకులు హేమలత, రుక్మిణి, వినీల, తిరుపతమ్మ, మేరీ రోజమ్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తాం అని చెప్పి అధికారం లోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను విస్మరించారని రిటైర్డ్ విజిలెన్స్ అధికారి రామిరెడ్డి అన్నారు. పెదకాకాని సెంటర్లో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపి ప్రసంగించారు. అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయకుండా అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టటం సరైనది కాదని అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్చాలన్నారు. ఎస్మా చట్టం అంగన్వాడీలకు వర్తించదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజా,రమేష్,కే. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : గత 30 రోజులుగా చేస్తున్న అంగన్వాడీల పోరాటానికి కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. దుగ్గిరాలలోని అంగన్వాడీల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల నాయకులు జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు సిహెచ్ పోతురాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : కొల్లిపరలో అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగుతుంది. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీనాయకులు నిర్మలా జ్యోతి, సంతోష్ కుమార్, ఏ జ్యోతి మాధవి, శ్రీరాములమ్మ, ఆదిలక్ష్మి మాట్లాడుతు సమ్మెలో ఉన్న అంగన్వాడీల ఇళ్లకు షోకాజ్ నోటీసులు పంపుతున్నారని, బెదిరేది లేదని తేల్చి చెప్పారు. సమస్యలు పరిష్కరించేవరకూ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.

ఓట్లు కోసం నెత్తిన పెట్టుకున్నారు.. గెలిచాక నేలకేసి బాదారు. కనీసం మా చాకిరీని కూడా గుర్తించకుండా నోటికి వచ్చినట్లు మంత్రులు మాట్లాడుతున్నారు. మాకిచ్చే జీతాల్తో మీరు ఒక్క నెల బతికి సూపించండి. మా కష్టం తెలుస్తుంది. మేము అమ్మలమే. అంగన్వాడీ సెంటర్ మూసివేస్తే మాబోటి తల్లులే ఇబ్బంది పడతారు. ప్రభుత్వాన్ని అడిగి.. అడిగి .. విసిగి వేసారి పోయి తప్పని పనిస్థితుల్లో ఆందోళనకు దిగాం. అంగన్వాడీ లబ్ధి దారులు మమ్మల్ని అర్థం చేసుకున్నారు. మాకు సహకరిస్తున్నారు. పనిగంటలకు మించి పనిచేసినా సమస్య తేల్చకుండా ప్రభుత్వమే భయపెట్టాలని నోటీసులు ఇస్తుంది. తక్షణం సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవా లని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



తాడికొండ, కొల్లూరులో 30వ రోజు సమ్మెను తెలియజేస్తూ 30వ నంబర్ ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :తెనాలిలో స్థానిక విఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న అంగన్వాడి సమ్మెకు సిఐటియు, సిపిఎం నాయకులు కొల్లిపర బాబుప్రసాద్, షేక్ హుస్సేన్ వలి తమ పూర్తి మద్దతును తెలిపారు. సమ్మె ప్రారంభించి 30 రోజులకు చేరుకోవటంతో శిబిరం వద్ద 30వ అంకె ఆకారంలో కూర్చుని అంగన్వాడీలు ప్రదర్శన చేశారు. వారికి మద్దతుగా బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు ఎవిఎన్ కుమారి, పి పావని, లావణ్య, ఎలిజబెత్, కె నాగలక్ష్మి, కె జ్యోతి, విజయలక్ష్మి, శాంత కుమారి, హసీనా బేగం, నాగమణి, శాంత, కుమారి, రాధాకుమారి, నాగలక్ష్మి, మీనాకుమారి, సుజాత, మాధవి, శ్రీలత, రాజకుమారి, రాధ, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, శాంతకుమారి, హేమలత, లక్ష్మి తిరుపతమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ :తాడికొండ సమ్మె శిబిరంలో అంగన్వాడీలు 30రోజును ఇండికేట్ చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సుబ్బాయమ్మ, కె రాజకుమారి, విజయలక్ష్మీ, నూర్జహాన్, అనసూయ, షంషాద్‌బేగం, ప్రేమ కుమారి, సరళ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ :పెదనందిపాడు లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధ వారానికి 30వ రోజుకు చేరుకున్నది. సంఘ మండల అధ్యక్షురాలు శివకుమారి కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో ఎస్మా పత్రాలను జీవో 2 పత్రాలను గంగలో కలిపి తమ నిరసన వ్యక్తం చేశారు మండల కేంద్రమైన కాకుమానులో సిఐటియు జిల్లా నాయకులు కందుల శ్రీనివాసరావు అంగన్వాడీల మండల సంఘ అధ్యక్ష కార్యదర్శులు శశికళ .వాసవి ల ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లిలో ఒంటి కాలిపై నిలబడి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. దీక్షలకు మద్దతు తెలిపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, టిడిపి సీనియర్ నాయకులు జంగాల సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యను ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికలకు ముందు సిఎం ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయమని అంగన్‌వాడీలు అడుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని సమస్య జఠిలం కాకుండా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఫాతిమ, సుజాత, తబిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


దుగ్గిరాలలో


మంగళగిరిలో


పెదకాకానిలో


పెదనందిపాడులో


తెనాలిలో


తాడేపల్లిలో

మున్సిపల్ కార్మికులు భిక్షాటన

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారని, దీనితో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధర్మం చేయండి అయ్యా అంటూ మార్కెట్, చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో వీధి వ్యాపారులు, పాదచారులు, వాహనదారుల వద్ద బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఇంజినీరింగ్ విభాగం నాయకులు పాశం పూర్ణచంద్రరావు, వెహికల్ షెడ్ డ్రైవర్స్ కమిటీ నాయకులు కె.మరియదాసు, జి. శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. ధరలు పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కారసాల శౌరమ్మ, సామ్రాజ్యం, ఏటుకూరి రోశమ్మ, స్వామి దాసు, సుజాత, గర్నెపూడి ప్రసాదరావు, ప్రవీణ్, షరీఫ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి - మంగళగిరి :మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 16వ రోజు చేరింది. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, వివి జవహర్లాల్, ఫెడరేషన్ నాయకులు కే ఏసు, వై శివ నాగేశ్వరరావు, కే శివ నాగేశ్వరమ్మ, ఎం నాగార్జున, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోవడంతో మున్సిపల్ కార్మికులు బుధవారం తాడేపల్లి పట్టణంలో భిక్షాటన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు ప్రభుత్వం తమకు చేసిన అన్యాయంపై పెద్దఎత్తున నినాదాలు చేస్తూ జోలి పట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టె కరుణాకరరావు, వెంగమ్మ, మరియదాసు, నాగమణి, రాంబాబు, కుశలరావు, శశికళ, లక్ష్మి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి :మున్సిపల్ కార్మికుల సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్, షరాబజారు, శివాలయం రోడ్డు, బెల్లపుకొట్లు బజార్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు బిక్షాటన చేసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తమ ఆర్థిక ఇబ్బందులను తెలియజేస్తూ బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్వలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజారోగ్యాన్ని దష్టిలో పెట్టుకునైనా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిండాల నాగరాజు, జయలక్ష్మి, బి సురేష్, జీ రమణ, ఏం రేఖ, ఎం పద్మ, దార పద్మ, నాగయ్య, ఆకుల రామకష్ణ, రామ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : సమ్మెలో భాగంగా మండలంలోని ఎర్రబాలెంలో పారిశుధ్య కార్మికులు స్థానిక వేప చెట్టు సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వీరికి సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని అన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయటం సరైనది కాదని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపట్ల ప్రభుత్వం పంతం వీడి సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని రవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాజధాని నాయకులు ఎస్.కె ఎర్ర పీ రు, అత్తలూరి వీర వెంకయ్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ బాబు ఓ రామారావు టి రాజలక్ష్మి కే కోటేశ్వరి ఎన్ దివ్య ఏం పార్వతి రోశయ్య మేడ శీను, టీ సాంబయ్య కే శీను టి రాంబాబు తదితరులు నాయకత్వం వహించారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా మండలంలోని కాజా గ్రామంలో పారిశుధ్య కార్మికులు రిలే దీక్షల ను కొనసాగిస్తున్నారు. దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. పారిశుధ్య కార్మికులు తమ నిరసనను టెంట్ లో నే రాత్రి పగలు దీక్షను కొనసాగిస్తున్నారు. రాత్రులు వనికించే చలిలోనూ అక్కడే పడుకొని నిరసన తెలియజేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంటిఎంసి లో విలీనమైన గ్రామాల పారిశుధ్య కార్మికుల ప్రత్యేక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల పారిశుధ్య కార్మికులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నేతలు బి. కోటేశ్వరి, మాధవ రెడ్డి, సత్యమారెడ్డి, రామయ్య, డి. శ్రీనివాసరావు, నాగేంద్ర బాబు, బుజ్జీ, వెంకట్, క్రాంతి, రమణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.




తెనాలిలో


తాడేపల్లిలో


మంగళగిరిలో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి - క్రోసూరు

విజయవాడలో ఈనెల 19న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారీ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. ఈ మేరకు ఆహ్వాన పోస్టర్‌ను స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. నాయకులు సిహెచ్.జయపాల్, జి.దాసు, మురళి, పి.కోటయ్య పాల్గొన్నారు.



మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న పీడీ జోసెఫ్ కుమార్

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని చీమలమర్రికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పాటిబండ్ల శివ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సంబంధిత శాఖ ద్వారా అందిన రూ.5 లక్షల చెక్కును మృతుని భార్య శ్రావణికి ఉపాధి హామీ పీడీ జోసెఫ్ కుమార్ బుధవరం అందించారు. ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ బి. శ్రీనివాస్‌రెడ్డి, ఎపిడి వెంకటనారాయణ, మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి, ఏపీవో రామకృష్ణ, ఎంపిటిసి టి.సాంబయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసి ద్వారా బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

ప్రమాదంలో మరణించిన వ్యక్తికి రూ.10 లక్షల బీమా చెక్కును ఎల్ఐసి ఏజెంట్లు బుధవారం అందించారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న బిపిఎల్ పెట్రోల్ బంకులో ఎం.శ్యామ్‌బాబు 15 ఏళ్లుగా పని చేస్తుండగా మూణ్ణెల్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంకు యాజమాన్యం అప్పటికే తమ సిబ్బందికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ పాలసీ కట్టిం ఉండడంతో దాని తాలూకు చెక్కును ఏజెంట్ బిఎం కోటేశ్వరరాజు సహకారంతో పెట్రోల్ బంకు యాజమాన్యం పి.ఆంజనేయులు ద్వారా మృతుని భార్యకు ఇచ్చారు.

ఎస్పీని కలిసిన నూతన సిఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఒన్‌టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సి.కృష్ణారెడ్డి బుధవారం ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో తిరుపతి జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేస్తూ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. విధులను సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయడంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల నేపథ్యంలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఎస్పీ సూచించారు.

'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలు ప్రారంభం



పోటీలపు ప్రారంభిస్తున్న జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - నకరికల్లు

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలను మండల కేంద్రమైన నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జెడ్‌పి పాఠశాలలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం ప్రారంభించారు. క్రీడా ప్రాంగణంలోని జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి బాలునాయక్, ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి, పిఇటిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఆటల వలన శరీర వ్యాయామం కలిగి అరోగ్యం మెరుగవుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రమైన శావల్యాపురంలోని జెడ్‌పి పాఠశాలో ఆడుదాం ఆంధ్ర పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల ద్వారా గ్రామీణ స్థాయిలోని నైపుణ్యవంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందరూ బాగా రాణించాలని ఆకాంక్షించారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

క్రీడాకారునికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా గత పదేళ్లుగా దేశంలో ఎక్కడ పరుగు పందేలు జరిగినా వాటల్లో పాల్గొని బంగారు, కాంస్య పతకాలతోపాటు మరెన్నో బహుమతులు సాధించి వినుకొండ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌లో ఆడాలన్నదే అబ్దుల్లా ఏకైక లక్ష్యం. నిరుపేద కుటుంబానికి చెందిన అబ్దుల్లాకు సరైన పోషకాహారం లేక, రన్నింగ్ శిక్షణకు సంబంధించిన సరైన కిట్లు, మెరుగైన శిక్షణించే కోచ్‌ల తర్ఫీదు లేక పై స్థాయికి వెళ్లలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం అబ్దుల్లాకు బుధవారం నగదు ప్రోత్సాహం అందజేశారు. అవకాశం ఉన్న ఇతర దాతలూ సహకరించి మంచి క్రీడాకారుణ్ణి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.లింగారావు, బి.మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ ఎం.వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

తారాస్థాయికి వైసిపి ప్రచార పిచ్చి : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట



వైసిపి నాయకుల ప్రచార భూతం ఆలయాలనూ వదలడం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఒ ఆలయంపై 'మా నమ్మకం నువ్వే జగన్' ఫ్లెక్సీ ఏర్పాటును విమర్శిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మట్లాడారు. అధికార పార్టీ, నాయకులకు ప్రచార పిచ్చి తారాస్థాయికి చేరిందని, ప్రజలు త్వరలోనే వీరికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వైద్యసేవలను అంకిత భావంతో అందించాలి



వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలకు అంకితభావంతో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని బాబాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని జెసి బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎం..రామ్మోహనరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని సుగాలికాలనీలో నిర్మితమవుతున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాజేష్‌నాయుడు కోరారు. పట్టణంలోని సాంబశివనగర్ పార్కు ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్, బేరింగ్ మౌలాలి, పి.వెంగళరాయుడు, ఎస్.సైదావలి, కౌన్సిలర్లు కోట్యానాయక్, రమణీబాయి పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న రాజేష్‌నాయుడు

విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని వివేకానంద హైస్కూల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం ప్రతిబింబించేలా ముగ్గులతో అలంకరించారు. ముగ్గులు పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఆట పాటలతో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. సంక్రాంతి విశిష్టతను ఉపాధ్యాయులు వివరించి భోగిపళ్లతో ఆశీర్వదించారు. అందరికీ వివేకానందా విద్యా సంస్థల అధినేత సయద్ రఫిక్ అహమద్ శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవడంతోపాటు వాటిని ఆచరించాలని ఒయాసిస్ సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి అన్నారు. పట్ణంలోని చైతన్య లిటిల్స్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ ఈదర గిరి, ప్రిన్సిపాల్ లక్ష్మి, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఇన్నర్ వీల్ క్లబ్ కోశాధికారి రమా పాల్గొన్నారు.

స్థానిక పండరిపురంలో కోస్టల్ బ్యాంక్ వెనుక గల మాస్టర్ మైండ్ స్కూల్ వేడుకలు నిర్వహించడంతోపాటు ఒయాసిస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు పెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఎస్.కె తమీం, ప్రిన్సిపల్ రహీం పాల్గొన్నారు.





సర్టిఫికెట్లు అందచేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి

ఆశాలకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి–గుంటూరు

స్థానిక మహిళా ప్రాంగణంలో ఆశా వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆశాలకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఒ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలు ప్రజలకు వివరించి వారికి అన్ని ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలని కోరినారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతున్నందన, అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందించాలన్నారు. అర్హులైన వారికి మాతాశిశు సంరక్షణ సేవలు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించటం, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలా నెలా మందులు ఇప్పించటం, గ్రామ ఆరోగ్య పారిశుధ్యం మరియు పోషకాహారం కమిటీ సమావేశంలో పాల్గొని గ్రామంలో వున్న ఆరోగ్య సమస్యలను వారి దష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ సుబ్బరాజు, డిపిమెచ్‌ఎన్‌ఒ శాంతకుమారి, హెచ్‌ఇఒ చంద్రశేఖర్, డిసిఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



టాస్ వేస్తున్న మేయర్, కార్యక్రమంలో కమిషనర్, ఇతర అధికారులు

మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ప్రారంభం

ప్రజాశక్తి–గుంటూరు

ఆడుదాం ఆంధ్రా ద్వారా యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికి తీయటానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి స్థానికి బిఆర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యువత ఆడుదాం ఆంధ్రని సద్వినియోగం చేసుకోవడం ద్వారా రానున్న కాలంలో క్రీడల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా నగరంలో వార్డు సచివాలయాల స్థాయిలో వాలీబాల్, కబాడీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. గుంటూరు నగరం నుండి రాష్ట్ర స్థాయిలో పతకాలు వచ్చేలా క్రీడాకారులు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, ఎస్.ఈ.(ఎఫ్‌ఏసి) సుందర్రామి రెడ్డి, డి.యస్.డి.ఓ వెంకటేశ్వర రావు, షేక్ నూరి ఫాతిమా, డిఈఈ శ్రీధర్, కార్పొరేటర్లు మీరావలి, సంతోష్, రాజేష్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయి పరిశోధనలు జరగాలి

ప్రజాశక్తి – తాడేపల్లి రూరల్

ఇటీవల కాలంలో బల్బుల తయారీలో నూతన వరవడి సృష్టించిన ఎల్‌ఇడి బల్బుల తయారీపై ఇంకా లోతైన అధ్యయ నాలు జరగాల్సిన అవసరం ఉందని హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ డి.నారాయణ రావు అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా, ఐఐటి ఢిల్లీ నుండి డాక్టర్ విజయ ప్రకాష్, నేషనల్ ఫిజికల్ లాబరేటరీ, సిఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆచంట వేణుగోపాల్ ప్రసంగించారు. కాంతి పదార్ధాల తయారీలో ఉన్నత స్థాయి పరిశోధనలు జరగాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న భౌతిక శాస్త్రవేత్తలు భౌతిక శాస్త్ర రంగంలో ప్రచురించిన పరిశోధనా పత్రాలను కూర్పు చేసి తయారు చేసి ప్రచురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. భౌతిక శాస్త్ర సాంకేతిక పురోగతులపై వెలుగునిస్తూ సమగ్ర పరిశోధన పత్రాలను వారు ప్రదర్శించారు. ఆప్టోఎలక్ట్రానిక్స్, మెటామెటీరి యల్స్ మరియు వివిధ రకాల టెక్నాలజీలు వాటి ఉపయోగాల గురించి వక్తలు ప్రసంగించారు. ఈ సదస్సుకు డిఎస్టి సెర్బ్ ఆర్థిక సహకారం అందించినట్లు కెఎల్ యు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న తెలిపారు. రెండు రోజులు జరిగిన ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలల నుండి పలువురు పరిశోధనా అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కోఆర్డినేటర్ డాక్టర్ శివగంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భౌతిక శాస్త్ర రంగంలో ప్రచురించిన పుస్తకాన్నిఆవిష్కరిస్తున్న అతిథులు



ఎరుకలపూడి పాదయాత్రలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

అంగన్వాడీలపై ఎస్మా తక్షణం రద్దు చేయాలి : ఆలపాటి

ప్రజాశక్తి–తెనాలిరూరల్ :రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెనాలి నియోజకవర్గంలో ఆలపాటి తలపెట్టిన ప్రజా పాదయాత్ర బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. కఠెవరంలో ప్రారంభమైన ప్రజా పాదయాత్ర నాయకులతో పాటు ప్రజల స్పందన విశేషంగా అందుకుంటుంది. జనసేన, టిడిపి ఉమ్మడిగా ప్రకటించిన మ్యానిఫెస్టోలో 18 ఏళ్ళు నిండిన స్త్రీలకు నెలకు రూ 18 వందలు ఇస్తామన్నారు. యువతకు రూ 3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు నమ్మకం కలిగేందుకు ప్రకటించిన హామీలపై బాండ్లు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. బూటకపు హామీలతో ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్న వైసిపి వర్గాలపై మండిపడ్డారు. ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా చెప్పదగ్గ పారిశుధ్య కార్మికులకు సమానపనికి సమాన వేతనం కల్పించకుండా వారి డిమాండ్లపై నీళ్లు చల్లడం హేయమైన చర్య అన్నారు. మరోపక్క అంగన్వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారిని రోడ్లపాలు చేశారన్నారు. తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చ డంలో పూర్తి వైఫల్యం చెందిందన్నారు. అరెస్టులు పేరిట పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీలను ముందస్తు అరెస్టులు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు.సాయంత్రానికి గుడివాడ చేరుకోవాల్సిన పాదయాత్ర పార్టీ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య ఆకస్మిక మరణంతో వాయిదా పడింది.

నేడు ఉచిత మెగా మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి దుగ్గిరాల :గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ స్థానిక కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ మరియు తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో స్థానిక జంపాల వారి కళ్యాణమండపంలో గురువారం ఉదయం 9గంటలకు మెడికల్ క్యాంప్ నిర్వహించ నున్నట్లు దోస్త్ సభ్యుడు గద్దె శ్రీనివాస్ తెలిపారు. క్యాంపులో క్యాన్సర్ స్క్రీనింగ్ గుండె ఎముకలు జనరల్ మెడిసిన్ చిన్నపిల్లల వైద్యం ఇప్పుడు నిపుణులు పాల్గొంటారని, మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు.

సామాజిక సమతా సంకల్పం నిర్వహణ

ప్రజాశక్తి – తెనాలి

ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు సామాజిక సమతా సంకల్పం పేరిట కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక సంఘ పరిధిలోని 47 వార్డు సచివాలయాలలో కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం జస్వంత్ రావు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మృతి

ప్రజాశక్తి – తెనాలిరూరల్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య(63) బుధవారం గుండెపోటుతో మృతి తిచెందారు. గంగానమ్మపేట ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. వారికి భార్య, కుమార్తె ఉన్నారు. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి మరణం పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నక్కా ఆనందబాబు, కనపర్తి శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణ్ తదితరులు నివాళిలర్పించారు.

మంగళగిరిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి – మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని రాజా వెంకటాద్రి నాయుడు కళావేదికలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గంజ్ చిరంజీవి ప్రారంభించారు. ఆధునిక పరికరాలతో కంటి వెలుగు కార్యక్రమం భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కంటికి అవసరమైన వైద్యం అందించడం జరుగుతుందని వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ గంజి చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, వి విజయ్, బి నర్సయ్య, టి శ్రీనివాసరావు, సిహెచ్ మహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి – తెనాలి

స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్ పర్యవేక్షించారు. శిబిరంలో రోగులకు అందుతున్న సేవలు, పంపిణీ చేస్తున్న మందులను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయుడు, ,మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, యుహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ మౌనికకుమార్, గారు, డాక్టర్ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు

ఐద్వా నాయకురాలు లక్ష్మీ కన్నుమూత

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్

పెదవడ్లపూడికి చెందిన మహిళా సంఘం నాయకురాలు లక్ష్మి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఎస్. ఎస్ చెంగయ్య, సిపిఎం నాయకులు ముసలి పకీరయ్య, సిహెచ్ రామ సుబ్బయ్య, మోర్ల కోటిలింగం, పెదవడ్లపూడి మాజీ సర్పంచ్ సిహెచ్ వెంకటేశ్వరరావులు నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి – చేబ్రోలు :బుధవారం శేకూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మత్తు పదార్థాల దుష్ప్రభావాల పై ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాతంగి శ్యామల మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం కౌమార బాలల బాధ్యతని అన్నారు. మత్తు పదార్థాల ప్రభావం వలన కొంత మంది బాలలు బానిసలుగా తయారవుతున్నారని, చదువుకు దూరమవుతున్నారు అన్నారు. అందువలన తల్లిదండ్రులు మరియు బాలలకు అవగాహన కొరకు ఆడియో రూపొందించి దాని ద్వారా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బి . ప్రశాంతి మాట్లాడుతూ డ్రగ్స్ వాడితే డిప్రెషన్, మతిస్థిమితం కోల్పోవడం, ఆందోళన వంటి మానసిక సమస్యలు వస్తాయని అన్నారు. గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, మూత్ర ిపిండాలు దెబ్బతినటం వంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. క్యాన్సర్, మానసిక అనారోగ్యం ఇతర ప్రభావాలు ఉండవచ్చునని, ప్రజల అవగాహన కోసం ఆడియో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి జె .ఫణి ప్రవల్లిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసం అనూష, సచివాలయ సిబ్బంది ఓంకారమ్మ, క్రాఫ్ కో– ఆర్డినేటర్ జి.వెంకయ్య పాల్గొన్నారు.

శ్రీకళా నిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు


ప్రజాశక్తి – కొల్లిపర



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

శ్రీ కళానిలయం కొల్లిపర వారి ఆధ్వ ర్యంలో స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో గాదె సుబ్బారెడ్డి కళవేదికపై 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ కళానిలయం అధ్యక్షులు జొన్నల అన్నిరెడ్డి తెలిపారు. సోమ వారం శ్రీ కళానిలం కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కళానిలయం కార్యదర్శి బొమ్మ రెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో భాగంగా 2022–2023 సంవత్స రంలో పది, ఇంటరు పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రంవల్లుల పోటీల్లో పాల్గొన దలిచిన మహిళలు 15వ తేదీ ఉదయం 10 గంటల లోపు కొల్లిపరలోని శ్రీ కళానిలయం కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాళా నిలయం సభ్యులు ఆరిమండ శివశంకర్ రెడ్డి, భీమ వరం శివ కోటిరెడ్డి, ఆరిమండ వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న నారాయణప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డు నందు గల హిందూ ఫార్మసీ కాలేజిలో బుధవారం విద్యార్థులకు తాము నిర్ణయించుకున్న గమ్యం చేరటానికి అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ప్రముఖ ఔషధ సంస్థ ఇఎంఇఆర్కె ఏరియా మేనేజర్, కెరీర్ మెంటార్ గోవిందరాజుల నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు భావ వ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే తాము అనుకున్న గమ్యం చేరగలరన్నారు. సాంకేతిక అంశాలతోపాటు, ఇంగ్లీష్ భాషపై పట్టు, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూలో ప్రదర్శించవలసిన స్కిల్స్, భావ వ్యక్తీకరణ, బృంద చర్చలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ జూపూడి రంగరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్.ఎస్.మధుసూదన రావు తమ కళాశాలను ఎంపిక చేసుకొని ప్రవేశం పొందినందుకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయభాస్కర్, ఫార్మ్.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ పి.జవహర్‌బాబు, షేక్ శర్మాస్‌శ్రీ తదితరులు పాల్గొన్నారు.



గీతాంజలి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఏటి అగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రకరకాల ముగ్గులు, గొబ్బెములు చిన్నారులకు భోగిపళ్లు, పోశారు. స్కూల్ డైరెక్టర్ షేక్.హుస్సేన్ మాట్లాడుతూ సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మిస్ షేక్ షాంషాద్ భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్‌విఆర్ కళాశాలలో భోగిమంటలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆర్‌విఆర్ విద్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని రాయపాటి వెంకట రంగారావు విద్య కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య హాజరై సంక్రాంతి ప్రాముక్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ యం.రవికుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగంచారు. ఈ సందర్భంగా భోగి మంటలు, కోలాటం, సంప్రదాయ వస్త్రధారణ, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేస్తున్న కాలేజి సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

జెకెసి కాలేజీలో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలో మహిళా సాధికారత, విస్తృతి విస్తరణ కార్యకలాపాల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు ముగ్గులు, గోరింటాకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాల బాలికలు ఇరు జుట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళి మోహన్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, డైరెక్టర్ యస్.ఆర్.కె.ప్రసాదు, మహిళా విభాగం ఉపాధ్యక్షులు పి.నాగసుశీల గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

బెదిరింపులు మాని.. సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్


సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న కళాధర్

ప్రజాశక్తి-గుంటూరు

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, సమ్మె విరమింప చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ కోరారు. ఏపి.సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరుకుంది. బుధవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో యుటిఎఫ్ జిల్లా, మండలాల నాయకులు ప్రేమ్ కుమార్, కోటిరెడ్డి ,శ్రీనివాసరావు ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు పాల్గొని మద్దతు తెలిపారు. కళాధర్ మాట్లాడుతూ విద్యాశాఖలో సమగ్రశిక్ష ఉద్యోగులను విలీనంచేసి, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకుండా, ఉద్యోగులను బెదిరించి, సమ్మె విరమింప చేయాలని ప్రయత్నించటం సరికాదన్నారు. ఉద్యోగ భద్రత లేక, చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గత నాలుగున్నర సంవత్సరాలుగా హామీలు నిలబెట్టుకుంటారని ఎదురు చూసి, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో సమ్మె చేపట్టా రన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా షోకాజు నోటీసులతో బెదిరించాలని చూస్తుందన్నారు. జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు అనేక రెట్లు పెంచి, వేతనాలు మాత్రం సంవత్సరాలు తరబడి పెంచకపోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, కోశాధికారి యం.గంగయ్య, కె.కిరణ్ కుమార్ జ్యోతి ,శివ పార్వతి, చంద్ర, రాధా, చలపతి, సుభాని, సుజీత్, వినోద్, అరుణ్ , గౌరి, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగ్ పిక్కర్లకు డ్రైవింగ్ శిక్షణ



డ్రైవింగ్ శిక్షణ ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ర్యాగ్ పిక్కర్లకు పారిశుధ్య వాహనాల డ్రైవింగ్ శిక్షణ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంపును నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర సుందరీకరణకు, స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ కషి చేస్తుందని, ఇందులో నగర ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ వారు ర్యాగ్ పికర్స్‌కు అందించిన వాహనాలను వారే నడుపుకునేలా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సదరు వాహనాలను నగరంలో పారిశుధ్య నిర్వహణ కోసం వినియోగిస్తూ ర్యాగ్ పిక్కర్స్‌కు జిఎంసి నుండే జీవనాధారం కల్పిస్తుందని తెలిపారు.కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్యం అందేలా ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా 220 ఈ-ఆటోలను రాష్ట్ర ప్రభుత్వం అందించటం జరిగిందని, ర్యాగ్ పిక్కర్లకు సఫాయి కర్మచారి కార్పోరేషన్ అందించిన యుజిడి పైప్‌లైన్ క్లీనింగ్ రాటింగ్ మెషిన్లు, జేసిబిలు, నాలా క్లీనింగ్ మెషిన్లు, సక్షన్ కం జెట్టింగ్ మెషిన్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ మెషిన్లను వారే నడుపుకునేలా నవజీవన్ ఆర్గనైజేషన్ ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కొండారెడ్డి, కార్పొరేటర్ సంతోష్, నవ జీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.పెంచలయ్య, ర్యాగ్ పిక్కర్స్ పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన ఇజ్రాయిల్ ప్రతినిధులు


మాట్లాడుతున్న నవోర్ గిలోన్, వేదికపైన లావు రత్తయ్య, ఎంపి శ్రీ కృష్ణదేవరాయులు

ప్రజాశక్తి-గుంటూరు :భారత్-ఇజ్రాయిల్ దేశాల మధ్య వ్యవసాయ రంగంలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని భారతదేశంలో ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గిలోన్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గిలోన్‌తో పాటు ఇతర ప్రతినిధులకు వర్సిటీ చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు.కార్యక్రమంలో అకడమియాతో పాటు దౌత్యపరమైన అంశాల గురించి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా నవోర్ గిలోన్ విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు, వీసీ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు, అధిపతులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నవోర్ గిలోన్ మాట్లాడుతూ అగ్రికల్చర్ టెక్నాలజీ, విద్య, పరిశోధనతోపాటు సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించామన్నారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల ఎక్స్ఛేంజ్, విద్య, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌ను అభివద్ధి చేసుకోవడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ముఖ్య అతిథిని వర్సిటీ ప్రతినిధులు సన్మానించారు.

జాతీయస్థాయి నృత్య పోటీలకు కెఎల్ యు విద్యార్థిని ఎంపిక


సాధించిన అవార్డుతో శృతి సమన్వి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

జాతీయ స్థాయి నృత్య పోటీలకు కెఎల్ యు విద్యార్థిని శృతి సమన్విత కాకర్లపూడి ఎంపిక యినట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ సిహెచ్. హనుమంత రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్శిటీలో లిబరల్ ఆర్ట్స్ కింద బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శృతి సమన్వి సాక్ లోని డాన్స్ క్లబ్‌లో క్రియాశీలక సభ్యురాలు అని ఆయన అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన 37వ సౌత్ జోన్ ఇంటర్-యూని వర్శిటీ యూత్ ఫెస్టివల్ 2023-24లో క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ఆమె జాతీయ స్థాయిలో 2వ స్థానాన్ని కైవసం చేసుకుందని అన్నారు. ఈ నేపద్యంలో ఆమె ఈ ఏడాది మార్చినెలలో లూథియానాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపియినట్లు ఆయన పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఎపి తరుపున శృతి సమన్వి కాకర్లపూడి ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శృతి సమన్వి కాకర్లపూడికివర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రోఫె సర్ వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు, కటుంబ సభ్యులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.